# మేజిక్ ఆఫ్ మహాత్మా

డా॥ బి.వి.పట్టాభిరామ్ Ph.D

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | నాయకత్వానికి నాంది | 13 |
| 2. | మీ సంగతి మీకు తెలుసా? | 24 |
| 3. | సెల్ఫ్ మేనేజిమెంటు | 32 |
| 4. | ఎమోషనల్ ఇంటెలిజెన్సు | 40 |
| 5. | స్ట్రెస్ మేనేజిమెంటు | 52 |
| 6. | లక్ష్య నిర్ణయం– గోల్ సెట్టింగ్ | 63 |
| 7. | ఆత్మవిశ్వాసం – సెల్ఫ్ కాన్ఫిడెన్స్ | 71 |
| 8. | సెల్ఫ్ కంట్రోల్ | 81 |
| 9. | అడ్జస్ట్‌మెంటు | 94 |
| 10. | నాయకత్వ లక్షణాలు | 103 |
| 11. | సెల్ఫ్ సర్వీసు | 109 |
| 12. | సత్య బోధన – సత్య శోధన | 115 |
| 13. | మోటివేషన్ | 123 |
| 14. | ఆత్మకథా? వ్యక్తిత్వ వికాస గ్రంథమా? | 130 |

# నాయకత్వానికి నాంది

ఒక వ్యవస్థకు దిశానిర్దేశం చేసేది నాయకుడు. నాయకత్వ లక్షణాలు వంశపారంపర్యంగా వచ్చేవికావు. నాయకులుగా ఎవరు జన్మించారు. పరిస్థితులు, వారి అంకితభావన వారిని నాయకులుగా తీర్చిదిద్దుతాయి.

భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించటానికి గాంధీజీ ఒక అద్భుత వ్యూహంతో ప్రణాళిక రచించారు. హింసకు తావివ్వకుండా, రక్తం చిందించకుండా, ఎటువంటి ఆయుధాలు ఉపయోగించకుండా కదిలారు. అంతవరకు ప్రపంచంలో జరిగిన ఏ యుద్ధంలోనూ, ఎవరూ అవలంబించని, ఊహించని, "అహింస"ని ఆయుధంగా స్వీకరించారు.

గాంధీజీ జీవిత చరిత్ర అధ్యయనం చేస్తే నాయకత్వం అంటే ఏమిటో అర్థం అవుతుంది. నాయకుడు అందరినీ ఏకత్రాటిపై నడిపించి, వ్యవస్థతో మమేకం అవ్వాలి. వ్యవస్థలో తాను కూడా ఒక సాధారణ సభ్యుడినేనని ఎట్టి పరిస్థితిలో మర్చిపోకూడదు.

ఈనాటి విద్యావ్యవస్థలో నిర్వహణ శాస్త్రం (Management) చాలా ముఖ్యమైనది. ఆర్థిక, వ్యాపార, విద్యా రాజకీయ రంగాల్లో ఈ మేనేజిమెంటు అనే ప్రక్రియ తప్పనిసరి.

## నిర్వహణ శాస్త్రం

ఒక సంస్థ, ఒక వ్యవస్థ, ఒక లక్ష్యం సమర్థంగా సాగాలంటే, దాని నిర్వహణ ఎంతో చాకచక్యంగా, ప్రణాళికాబద్ధంగా చేయాలి. నిర్వహణ శాస్త్రంలో తొమ్మిది ముఖ్యమైన అంశాలుంటాయి. అవి.

1. రూపకల్పన (Policy)
2. ప్రణాళికా రచన (Planning)
3. సంబంధ బాంధవ్యాలు (Communications)
4. నిర్దేశన (Assignment)
5. పర్యవేక్షణ (Supervision)
6. జట్టు నిర్వహణ (Team building)
7. ప్రేరణ (Motivation)
8. సమన్వయం (Coordination)
9. అభివృద్ధి (Development)

నిర్వహణ శాస్త్రంలో ఎవరు ఏ పని చేయగలరో అనేది గుర్తించి వారిచేత ఆ పని చేయించటం ఒక తెలివైన ప్రక్రియ. దానికి వారికి తగిన శిక్షణను కూడా ఇవ్వాలి. మహాభారతంలో భీష్ముడు చివరిలో అంపశయ్య మీద పడుకున్నప్పుడు అనేక మేనేజిమెంటు సలహాలు ఇచ్చాడు. అందులో ముఖ్యంగా నాయకుడు తన చుట్టూ ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయాలని అన్నాడు. గాంధీజీ అక్షరాలా అదే పని చేశారు.

## గాంధీజీని నాయకుడిగా ఎందుకు అంగీకరించారు?

ఏ వ్యవస్థనైనా సరిదిద్దాలనుకున్నప్పుడు ముందు వ్యవస్థలోని మంచిచెడులు, లోతుపాతులు, ప్రజలవైఖరి, ప్రభుత్వ దృక్పథం, వనరుల లభ్యత వంటి విషయాలను విశ్లేషించాలి. ఆ వ్యవస్థను అనుకున్న రీతిలో తీర్చిదిద్దటానికి తగిన వ్యూహాలు, నియమాలు, ప్రతివ్యూహాలు రచించి, ఒక క్రమపద్ధతిలో వాటిని ఆచరణలో పెట్టాలి.

జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ (GE) అనే సంస్థకు సి.ఇ.ఓగా పనిచేసి, నష్టాల ఊబిలో ఉన్న ఆ సంస్థను లాభాలబాట పట్టించిన Jack Welch అనే మేనేజిమెంటు గురువు, నాయకత్వ విజయానికి 4-D ప్రిన్సిపల్ ఒకటి సూచించారు. అవి.

| | | |
|---|---|---|
| Designing | – | ప్రణాళిక |
| Direction | – | దిశానిర్దేశం |
| Decision making | – | నిర్ణయం |
| Delegation | – | పని అప్పగింత |